క్లుప్తంగా

పుష్ప గణపతిగా గణనాథుడు



నగరంపాలెం: స్థానిక ఏటుకూరురోడ్డు శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద 27వ గణేష్ చతుర్థి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం పుష్ప గణపతిగా అలకరించారు. వాసవీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్య క్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగవెంకట నారాయణ, కోశాధికారి కాజా శ్యాంసుందర్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ అన్నారామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా డాక్టర్ అనిల్‌బాబు



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతిగా డాక్టర్ పాటిబండ్ల అనిల్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ వి.వి.నారాయణరావు శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ అనిల్ బాబును విభాగాధిపతిగా నియమిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి ఉత్తర్వులు జారీ చేశారు. విభాగాధిపతిగా విధుల్లో చేరిన డాక్టర్ అనిల్‌బాబుకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

తెలుగు సాహిత్యంలో అద్వితీయమైన ప్రక్రియ హరికథ


నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీఆదిభట్ల నారాయణదాస కథాకరణ కళాపరిషత్ ఆధ్వర్యంలో శ్రీనారాయణ దాస జయంతోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, సంస్థ నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ ఉపద్రష్ట వెంకటరమణమూర్తి ప్రసంగిస్తూ ఆదిభట్ల నారాయణదాసు తన సాహితీ వైభవాన్ని హరికథకు పునాది వేశారని అన్నారు. ఆయన సంగీతం, సాహిత్యం, నృత్యాలను మేళవించారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో ఆయన సృష్టించిన హరికథ ప్రక్రియ అద్వితీయమైనదన్నారు. ఆయన ప్రతిభకు, వైభవానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమాన్ని కర్రా సూర్యనారాయణదాస్ పర్యవేక్షించారు.

నగరపాలక సంస్థ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ స్థలాలు ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సదరు ఆక్రమణలను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నందివెలుగు రోడ్ లోని చిన్నేరు కుంట స్థలాన్ని కొందరు అనధికారికంగా రాత్రికి రాత్రే దేవాలయ నిర్మాణం చేస్తున్నట్లు గుర్తించి, పనులను నిలుపుదల చేశామన్నారు. పోలీస్ అధికారులకు లేఖని పంపామని, పోలీసు, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఇప్పటికే స్థానిక ప్రజల సౌకర్యార్థం చెరువు అభివద్ధి, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తురకపాలెం ప్రజలకు విశ్వాసం కల్పించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



లక్ష్మీపురం: గ్రామంలో అసాధారణ స్థాయిలో మరణాల వలన తీవ్ర భయాందోళనలలో ఉన్న గుంటూరు పశ్చిమ మండలం తురకపాలెం గ్రామ ప్రజానీకానికి విశ్వాసం కల్పించే విధంగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం సీపీఎం బృందం తురకపాలెం గ్రామాన్ని సందర్శించి మృతుల కుటుంబాలతో మాట్లాడినట్లు వివరించారు. అంతుబట్టని మరణాలపై ఆందోళన వ్యక్తం అవుతుందని చెప్పారు. మూడు నెలల కాలంలో ఈ మరణాలు అసాధారణ స్థాయికి చేరి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురికావడానికి కారణమయ్యాయి అన్నారు. 30 మంది వరకు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్ల లోపు వయస్సు ఉండి చనిపోయిన వారందరి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, గుంటూరు నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు బి.ముత్యాలరావు, నగర నాయకులు బాషా, ఖాసిం, ఖాసిం వలి, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కేఎస్ మార్కెట్ తరలించేందుకు ప్రయత్నాలు

- పొన్నూరు బైపాస్ వద్ద ఓ కాంప్లెక్స్‌లోకి తరలించేందుకు చర్యలు
- రూ.3 కోట్లకుపైగా పన్ను బకాయిలు ఉన్నట్లు చెబుతున్న అధికారులు
- మార్కెట్ ఏ విధంగా నిర్వహిస్తారో అని ప్రశ్నార్థకంగా మారిన వైనం



కొల్లి శారద మార్కెట్ లోపలికి వెళ్లకుండా బారికేట్లు పెట్టిన దృశ్యం

నెహ్రూనగర్: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ ఉంది. డాక్టర్ కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌ను పొన్నూరు రోడ్డు హైవే బ్రిడ్జి దగ్గర ఉన్న ఓ కాంప్లెక్స్‌లోకి తరలించేందుకు పాత లీజుదారులు సన్నాహాలు మొదలుపెట్టారు. సోమవారం సదరు కాంప్లెక్స్ వద్ద షాపులు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నారు. సదరు కాంప్లెక్స్‌లోనే లావాదేవీలు జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అయితే ఇక్కడే ఓ చిక్కుముడి పడింది. సదరు షాపులకు సంబంధించి పన్ను బకాయిలు రూ.3 కోట్ల వరకు ఉన్నాయి. సదరు షాపుల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. రెవెన్యూ అధికారులు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇచ్చేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. మరో పక్క కోర్టులో ఈ విషయం నలుగుతుండటంతో అధికారులు దీనికి కౌంటర్ ఫైల్ కూడా వేశారు. సదరు కాంప్లెక్స్‌కు అనుమతులు పూర్తి స్థాయిలో అనుమతులు ఉన్నాయా.. లేదా అనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

వివాదం ఏమంటే..

డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ విషయంలో పాత లీజుదారులు అసలు తగ్గడం లేదనే చెప్పుకోవాలి. మార్కెట్‌లో ఉన్న షాపులకు 25 ఏళ్ల లీజుగడువు పూర్తయినా షాపులను ఖాళీ చేయకుండా కోర్టుల ద్వారా దాదాపు ఏడాదికి పైగా అక్కడే తిష్ట వేశారు. చివరికి కోర్టు బహిరంగ వేలం పాట పెట్టాలని ఆదేశించడంతో.. ఈ బహిరంగ వేలాన్ని ఎలాగైన ఆపాలని స్థానిక ఎమ్మెల్యేతో మంతనాలు జరిపించి.. మున్సిపల్ శాఖ మంత్రి ద్వారా కమిషనర్‌కు ఫోన్లు చేయించిన విషయం తెలిసిందే.. అయితే కమిషనర్ పులి శ్రీనివాసులు ఈ విషయాన్ని మంత్రికి కూలంకూషంగా వివరించడంతో నిబంధనల మేరకు వేలం పాట నిర్వహించాలని సూచించడంతో గత నెల 18, 19, 20వ తేదీల్లో 81 షాపులకు బహిరంగ వేలం నిర్వహించారు.

రికార్డు స్థాయిలో కార్పొరేషన్‌కు ఆదాయం..

25 సంవత్సరాల క్రితం షాపుల లీజులు కింద 81 షాపులకు లక్షల్లో ఆదాయం వస్తుంటే ప్రస్తుతం బహిరంగ వేలం నిర్వహించడం ద్వారా కార్పొరేషన్‌కు రూ.6.8 కోట్లు ఆదాయం సమకూరింది. వేలం పాటలో షాపులను దక్కించుకున్న వారికి ఏడు రోజుల్లో నాన్ రిఫండబుల్ ఫండ్ కట్టి షాపు తాళాలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. వేలం పాట జరిగి రోజులు గడుస్తున్నా పాత లీజుదారులు షాపులను ఖాళీ చేసేందుకు మొండికేశారు. శుక్రవారం షాపులకు స్వాధీనం చేసుకుని తాళాలు వేసేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై, డెప్యూటీ కమిషనర్లపై పాత లీజుదారులు అడ్డం తిరిగారు. షాపులకు తామకే కేటాయించాలని అడ్డం తిరిగడంతో చేసేదేమి లేక అధికారులు పోలీసులు సహకారంతో గత నెల 29 రాత్రి షాపులను స్వాధీనం చేసుకున్నారు. అయినా పాత లీజుదారులు షాపుల ముందే తిష్ట వేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ పులి శ్రీనివాసులు మార్కెట్ వద్ద బ్యారికేట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో సోమవారం మార్కెట్ బయట బ్యారికేట్స్ ఏర్పాటు చేశారు.

అధికారులు, వ్యాపారస్తుల మధ్య వాగ్వాదం

నెహ్రూనగర్: డాక్టర్ కొల్లిశారదా మార్కెట్‌లో పాత షాపు లీజుదారులు పొన్నూరు రోడ్డులోని ఓ కాంప్లెక్సులో మార్కెట్ ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో సోమవారం రాత్రి అక్కడకు వెళ్లిన నగరపాలక సంస్థ అధికారులు, వ్యాపారస్తులతో మాట్లాడారు. ఇక్కడ మార్కెట్ పెట్టుకోవాలంటే నగరపాలక సంస్థ అనుమతి తప్పనిసరి అని వారికి తేల్చి చెప్పారు.

దీంతో వ్యాపారస్తులు అధికారులపై మండిపడ్డారు. బస్టాండ్ ఎదురుగా, కొల్లిశారదా మార్కెట్ లో వ్యాపారం చేసుకోలేకపోయాం, ఇక్కడైనా వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

ప్రైవేట్ స్థలంలో మార్కెట్ పెట్టాలంటే కార్పొరేషన్ అనుమతి తప్పనిసరి

ప్రైవేట్ స్థలంలో మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలంటే మున్సిపల్ చట్టాలకు అనుగుణంగా నగరపాలక సంస్థ అనుమతి తప్పనిసరి. దీంతో పాటు సదరు కాంప్లెక్స్‌కు గతంలో వీఎల్‌టీ ట్యాక్స్(ఖాళీ స్థల పన్ను) రూ.3 కోట్లకు పైగా ఉంది. ఆ తరువాత అక్కడ నిర్మాణం చేసుకున్నారు. తమకు సదరు నిర్మాణం చేసుకున్నామని వీఎల్‌టీ మాకు ఆప్లికబుల్ కాదంటూ సదరు కాంప్లెక్స్ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు సదరు అంశంపై స్టే విధించింది. దీనికి అనుగుణంగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్(ఎంఎస్‌సీ) ద్వారా కౌంటర్ ఫైల్ కూడా వేయడం జరిగింది.

– చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్

రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు షేక్ నూరి ఫాతిమా



నెహ్రూనగర్: కొల్లి శారద మార్కెట్‌లో కూరగాయలు విక్రయించుకునేందుకు వచ్చిన రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా హెచ్చరించారు. షాపుల లీజు వివాదం నేపథ్యంలో సోమవారం రాత్రి అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని రైతులకు మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లో షాపులను కూటమి నేతలే రూ.లక్షల్లో పాట పెంచేసి కైవసం చేసుకున్నారని ఆరోపించారు. దీనికి తోడు మార్కెట్‌లోకి ప్రవేశించకుండా బారికేడులు ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు బైపాస్ దగ్గర ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో మార్కెట్ నిర్వహించుకునేందుకు వ్యాపారులు నిర్ణయించిన నేపథ్యంలో అక్కడికి వచ్చిన నగరపాలక సంస్థ అధికారులు ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి అవకాశం లేదని చెప్పడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు 25 ఏళ్ల లీజు గడువు పూర్తయిందంటూ రైతులను అక్కడ నుంచి పంపించివేయడం.. ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి వస్తే ఇక్కడ కూడా వ్యాపారం చేయకుండా అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తాత్కాలికంగా అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద విక్రయాలు చేసుకుంటున్న రైతులపై మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, దుకాణాల వద్దకు వచ్చి ఇక్కడ వ్యాపారం చేయడానికి వీలు లేదంటూ ఆదేశించడం సరికాదని చెప్పారు. రైతులు, వ్యాపారులకు అనుమతులు వచ్చేవరకు వారు వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

గుణగణాల ఈశుడే గణేశుడు



గణనాథుని పూజల్లో లేళ్ల అప్పిరెడ్డి



గణపతి పందిరిలో పాల్గొన్న అంబటి రాంబాబు తదితరులు

పట్నంబజారు: గుణగణాల ఈశుడే గణేశుడని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. విద్య, వినయం, వివేకం ప్రసాదించే వేలుపు వినాయకుడన్నారు. గుంటూరులోని పలు ప్రాంతాల్లో గణేష్ ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. చలువ పందిళ్ల వద్ద చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చుట్టుగుంటలో దొంతా బ్రహ్మం, కేవీపీ కాలనీలో కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక మండపాల్లో కొలువైన గణనాథుల విగ్రహాలను ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వాడవాడలా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు నిర్వహించడం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని చెప్పారు. సమాజానికి శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు. సకల జనులపై వరాల జల్లు కురిపించే మహా ఉదారుడైన లంబోదరుడిని అత్యంత భక్తి శ్రద్ధలతో సేవించిన, తాము తలపెట్టిన మంచి పనుల్లో ఎదురయ్యే ఆటంకాల తప్పక తొలగిపోతాయని కోరారు.

కార్యక్రమంలో చుట్టుగుంట మండప నిర్వాహకులు దొంతా బ్రహ్మం, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, రాయపాటి పవన్ కుమార్, మహంకాళి వెంకట్రావు, కేవీపీ కాలనీ మండప నిర్వాహకులు కాంద్రకుంట గురవయ్య, కొండా నాగేశ్వరరావు, తిరుమలేశ్వరరావు, విజయ్, జరపాల సాంబయ్య, కేతావత్ రవీంద్రనాయక్, అనిల్ నాయక్, కోటా వేణుగోపాలరావు, కటకం కోటేశ్వరరావు, పవన్ కుమార్, ప్రేమ్ కుమార్, వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, దాసరి గోపి పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో అంబటి

పట్నంబజారు: వినాయక చవితిని పురస్కరించుకుని గుంటూరు నగరంలో జరుగుతున్న విఘ్నేశ్వర చవితి పందిళ్లలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని హౌసింగ్ బోర్డు పాత వాటర్ ట్యాంకులు వద్ద ఎస్ఆర్కే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ విఘ్నేశ్వర దయతో ప్రతి ఒక్కరికి విఘ్నాలు తొలగిపోయి మంచి జరగాలని ఆకాంక్షించారు. గణనాథుడి దయతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం చేకూరాలని కోరారు. తొలి పూజ దేవుడు వినాయకునికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పడాల సుబ్బారెడ్డి, మామిడి రాము, మొండితోక శ్రీనివాసరావు, ఏటి కోటేశ్వరరావు, చెవుల శ్రీనివాస్, అన్నపురెడ్డి విజయభాస్కర్ రెడ్డి, బైరెడ్డి శివారెడ్డి, రామోజీ, నాగిరెడ్డి, కార్తీక్, సాయి, నవీన్, శివకుమార్, సురేష్ పాల్గొన్నారు.

అసెస్‌మెంట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పెదబాబు

గుంటూరు ఎడ్యుకేషన్ బోధనను హరిస్తున్న అసెస్‌మెంట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు డిమాండ్ చేశారు. సోమవారం కంకరగుంటలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పెదబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ఎఫ్ఏ-1 పరీక్షల్లో నూతనంగా రూపొందించిన అసెస్‌మెంట్ పుస్తక విధానం అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు బోధనా సమయం హరించే విధంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసేదిగా ఉందని, తద్వారా నాణ్యమైన విద్యకు విద్యార్థులు దూరమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అసెస్‌మెంట్ బుక్స్ ద్వారా పరీక్షలు నిర్వహణ విధానం ఎఫ్ఏ-2 పరీక్షల సిలబస్ పూర్తి చేయటంపై తీవ్ర ప్రభావాన్ని చూపి, అనుకున్న విధంగా సిలబస్ పూర్తిచేసే పరిస్థితులు లేవన్నారు. తక్షణమే ఎఫ్ఏ-2 పరీక్షల నిర్వహణకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వబాటలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. నూతనంగా భర్తీ చేయబోతున్న డీఎస్సీ నియామకాలకు సంబంధించి సెలక్షన్ లిస్టును ప్రకటించిన తర్వాతే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు వై.శ్యాంబాబు, యు.మహంకాళరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఎల్ఐసీ

హిందూ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వం



కొరిటెపాడు(గుంటూరు): జాతీయకరణ నాటి నుంచి దేశంలోని మౌలిక రంగాలకు కోట్లాది రూపాయల పెట్టుబడులను సమకూరుస్తూ దేశాభివృద్ధిలో ప్రభుత్వరంగ ఎల్ఐసీ ముఖ్య భూమిక పోషించడం అభినందనీయమని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.విశ్వం పేర్కొన్నారు. ఎల్ఐసీ 69వ వార్షికోత్సవాలను అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రారంభించారు. విశ్వం మాట్లాడుతూ 22 ప్రైవేటు బీమా కంపెనీలతో 25 సంవత్సరాలుగా పోటీ పడుతూ బీమా మార్కెట్‌లో ఎల్ఐసీ అగ్రగామి సంస్థగా నిలబడటానికి కోట్లాది మంది పాలసీదారుల విశ్వసనీయత వల్లనే సాధ్యపడిందని తెలిపారు. దేశ ఆర్థిక విస్తృత ప్రయోజనాల కోసం ఎల్ఐసీ మరింతగా శక్తివంతం కావాలని ఆకాంక్షించారు. బ్రాంచి మేనేజర్ పి.తిరుపతిరావు మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక సేవా కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సమగ్ర పరిష్కారం చూపాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు విభాగాధిపతులతో పాటు క్షేత్ర స్థాయి అధికారులు కూడా హాజరు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 32 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్‌లో సమావేశంలో పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరించారు.

చెరుకు రసం మెషీన్‌ను అమ్మేసుకున్నారు..

కొత్తపేట నుంచి నెహ్రూనగర్ వెళ్లే రోడ్డు పక్కన చెరుకు రసం అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఓ వృద్ధురాలి చెరుకు రసం మెషీన్‌ను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది రోడ్డు ఆక్రమణల పేరుతో తీసుకువెళ్లి సదరు మెషీన్‌ను అమ్మేసుకుని తనకు పాత మెషీన్‌ను ఇచ్చి తీసుకెళ్లమంటున్నారని వసంతరాయపురానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ అనే వృద్ధురాలు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

వేగంగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి

నగరంలోని నెహ్రూ నగర్ పంప్ హౌస్, సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర చేపట్టిన తాగునీటి పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వేగంగా తాగునీటి సరఫరాని పునరుద్ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నెహ్రూ నగర్, సంజీవయ్య నగర్ దగ్గర జరుగుతున్న పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలించారు.

నేటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా

పైపులైన్ ఇంటర్‌కనెక్షన్ పనులు పూర్తి

నెహ్రూనగర్: నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం రిజర్వాయర్)కు తాగునీటిని సరఫరా చేసే 900 డయా పైపులైన్ ఇంటర్‌కనెక్షన్ పనులు నెహ్రూనగర్ పంపింగ్ హౌస్ వద్ద, సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద జరుగుతున్న విషయం తెలిసిందే. పనుల కారణంగా నగరంలో మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా ఉండదని అధికారులు ముందుగానే ప్రకటించారు. 3వ తేదీ ఉదయం నుంచి తాగునీటి సరఫరా ఉంటుందని చెప్పారు. చెప్పిన గడువుకు ముందే పూర్తి చేసి సోమవారం రాత్రికి సరఫరా ప్రారంభించారు. దీంతో మంగళవారం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న 900 డయా పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పూర్తి చేయడంపై ఇంజినీరింగ్ అధికారులను, సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును సత్కరిస్తున్న హబీబుల్లా

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన షేక్ హబిబీబుల్లా సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. పదవి లభించిన హబీబుల్లాను అభినందించారు.

– పట్నంబజారు

నగర ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలి

రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు

నెహ్రూనగర్: నగర ప్రజలకు రక్షిత తాగునీరు అందించడం లేదని, నగర కార్పొరేషన్ పరిధిలో 62 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నా వాటిలో కొన్ని ట్యాంకులకుపై కప్పులు పూర్తిగా లేవని, మరికొన్ని నిరంతరం కడగటానికి వీలుపడక మురికి పేరుకుపోయిందని గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి పైపుల ద్వారా తగినంత నీరు తెచ్చుకునే అవకాశం ఉన్న మంగళగిరి ఓపెన్ చానల్ నుంచి కలుషితమైన నీటిని తీసుకుంటున్నారని ఈ పరిస్థితిని వెంటనే ఆపాలని కోరారు. కొన్ని వాటర్ ట్యాంకుల పైకప్పులు సక్రమంగా లేకపోవడంతో పక్షుల వ్యర్థాలు, కోతుల లాంటి జీవుల కళేబరాలతో కూడిన కలుషిత నీటిని అందిస్తున్నారన్నారు. ఇలాంటి కలుషిత నీరు తాగి 2018, 2024లో పదుల సంఖ్యలో ప్రజలు మృతి చెందారని ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. గోరంట్ల కొండపై నిర్మించిన వాటర్ ట్యాంకుకు రా వాటర్ పంపకుండా ఫిల్టర్ బెడ్స్‌తో రూపొందిన నీటిని పంపాలని కోరారు. గుంటూరు నగరంలో ఆస్తిపన్ను విపరీతంగా పెరిగిన నేపథ్యంలో దానికి తగ్గ సౌకర్యాలు కల్పించడంలో నగరపాలక సంస్థ విఫలమౌతుందన్నారు. కమిషనర్‌ను కలిసి వారిలో సభ్యులు వల్లూరి సదాశివరావు, కనపర్తి రాఘవరావు, రామాల అంజిరెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): 11 కేవీ పట్టాభిపురం ఫీడర్‌లో లైన్ల నిర్వహణ నిమిత్తం మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 డీఈఈ ఎస్.గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. కుందుల రోడ్, పట్టాభిపురం తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.